సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 125 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం | 09.09.2025



## కేంద్ర విధానాలపై కాంగ్రెస్ నిరసన

- హుస్నాబాద్‌లో దిష్టిబొమ్మ దహనం

3 లో



# ఇక ఇంటికే..!

## ఇంటర్ విద్య వ్యవస్థలో నకిలీలు

- ఫేక్ సర్టిఫికెట్లతో లెక్చరర్లుగా విధులు
- జనగామలో పలువురిపై అనుమానం
- సర్టిఫికెట్లను పరిశీలనకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు?
- ఓ సంఘం రాష్ట్ర స్థాయి నేతపై గతంలోనే కేసు

తెలంగాణ ఇంటర్ విద్య మరోసారి నకిలీల పర్వం తెరపైకి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణలో కొందరు అధ్యాపకుల సర్టిఫికెట్లు సరైనవి కావనే ఉన్నతాధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. దీంతో ఇతర రాష్ట్రాలలో పీజీలు చేసి క్రమబద్ధీకరణ పొందిన జూనియర్ కళాశాల లెక్చరర్ల సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు తెలిసింది.

- మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి

2 లో

## అభ్యంతరాలు ఉంటే తెలపాలి

- ముసాయిదా ఓటరు జాబితాపై హనుకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ మీటింగ్

5 లో





## ప్రజావాణి దరఖాస్తులపై తక్షణం స్పందించాలి

3

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై తక్షణం స్పందించాలని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్లతో గ్రీవన్స్‌లో పాల్గొన్న ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయా శాఖ అధికారలతో సమీక్ష నిర్వహించారు.

## 13న జాతీయ మెగా లోక్ అదాలత్

- కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి
- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

5 లో





# ఇక ఇంటికే..!

## ఇంటర్ విద్య వ్యవస్థలో నకిలీలు

- ఫేక్ సర్టిఫికెట్లతో లెక్చరర్లుగా విధులు
- జనగామలో పలువురిపై అనుమానం
- సర్టిఫికెట్లను పరిశీలనకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు?
- ఓ సంఘం రాష్ట్ర స్థాయి నేతపై గతంలోనే కేసు

**తెలంగాణ ఇంటర్ విద్య మరోసారి నకిలీల పర్వం తెరపైకి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణలో కొందరు అధ్యాపకుల సర్టిఫికెట్లు సరైనవి కావనే ఉన్నతాధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. దీంతో ఇతర రాష్ట్రాలలో పీజీలు చేసి క్రమబద్ధీకరణ పొందిన జూనియర్ కళాశాల లెక్చరర్ల సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు తెలిసింది.**

*- మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి*

తెలంగాణ ఇంటర్ విద్యా అధికారులు ఇప్పటి వరకు సుమారు రాష్ట్ర వ్యాప్తంగా 24 జిల్లాల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేపట్టారు. ఇందులో ఇప్పటి వరకు దాదాపు 600 వరకు నకిలీ అధ్యాపకులు ఇతర రాష్ట్రాల సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినట్టు అధికారులు భావిస్తున్నారు. జనగామ జిల్లాలో కుడా కొందరు లెక్చరర్లు ఇతర రాష్ట్రలలో దూర విద్య నుంచి పీజీ సర్టిఫికెట్స్ కలిగి ఉన్నారని అధికారులు గుర్తించినట్లు తెలిసింది. యూజీసీ నిబంధనల ప్రకారం ఈ ఒరిజినల్ సర్టిఫికెట్స్ ధ్రువపత్రాలు తెలంగాణ రాష్ట్రంలో చెల్లుబాటు కావని అధికారులు భావిస్తున్నారు. వీటిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఈ ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించాల్సిన అవసరం ఉందని స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు సిఫారసు చేశారు.

### జనగామలో మచ్చుకు కొందరు..

**జనగామ ధర్మకంచ** జూనియర్ కళాశాలకు చెందిన ఒక అధ్యాపకుడు అన్నామలై యూనివర్సిటీ నుంచి పొందిన సర్టిఫికెట్ యూజీసీ నిబంధనల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో చెల్లుబాటు కాదని సమాచారం. ఉద్యోగంలో చేరకముందే అధ్యాపకుడు సరిపడా విద్యార్హతలు కలిగి లేదని అధికారులు గుర్తించారు. గతంలో ఇదే విషయంలో ఉస్మానియా యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్ శంకర్ సీబీ సీఐడీకి సైతం ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించారు. సంఘం లీడర్స్ అనే ముసుగులో అధికారులను ప్రసన్నం చేసుకుని ఇంత కాలం ఆరోపణలను తొక్కిపెట్టి అప్పనంగా డీఏ, హెచ్ఆర్ఏలతో పాటు పూర్తి జీతాలు కొట్టేశారని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు.

**కొడకండ్ల** కళాశాలలో ఓ అధ్యాపకుడు చేతి రాతతో ఉన్న ఒరిజినల్ సర్టిఫికెట్లను కలిగి ఉన్నాడని అధికారులు గుర్తించారు. ఇదే విషయంలో ధ్రువపత్రాల పరిశీలన సమయంలో ఆర్‌జేడీ సంబందిత కళాశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరినట్లు సమాచారం. అనర్హులకు జీతాలు చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యయత కూడా ప్రిన్సిపాళ్లదేనని ఆ ఉన్నతాధికారి సూచించినట్టు తెలిసింది.

**జాఫర్‌గఢ్** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓ అధ్యాపకుడు సైతం తమిళనాడుకు చెందిన యూనివర్సిటీ నుంచి తప్పుడు ధ్రువపత్రాలతో ఉద్యోగం పొందినట్లు అధికారులు గుర్తించినట్టు తెలుస్తోంది. రెగ్యులరైజే షన్ సమయంలో ప్రిన్సిపాల్ ఈ ఉద్యోగి జెన్యూనిటీ సర్టిఫికెట్ కోసం తమిళనాడులోని మన్మోనియం సుందరం యూనివర్సిటీ కి దరఖాస్తూ చేయగా వింత అనుభవం ఎదురైంది. యూనివర్సిటీ అధికారులు అవాక్కై సంబంధిత అధ్యాపకుడి ఒరిజినల్ సర్టిఫికెట్స్ తమిళనాడులోని యూనివర్సిటీకి పంపవలసిందిగా కోరారు. పోస్ట్ ద్వారా అందరికి జెన్యూనిటీ వచ్చినప్పటికీ ఈ అధ్యాపకుడికి తమిళనాడు యూనివర్సిటీ అధికారులు జెన్యూనిటీ ఇవ్వకుండా తిరస్కరించారు. తర్వాత ఏం జరిగిందో తెలియదు.. కానీ ఆ అధ్యాపకుడు చేతిగుండా డైరెక్ట్ గా జెన్యూనిటీ సర్టిఫికెట్ తీసుకువచ్చి కళాశాలలో ప్రిన్సిపాల్‌కు సమర్పించాడు. వాస్తవానికి ఇంటర్ విద్యా కమిషనర్ ఆదేశాల ప్రకారం జెన్యూనిటీ సర్టిఫికెట్స్ తప్పకుండా పోస్ట్ ద్వారా యూనివర్సిటీ అధికారులు అవుట్ వార్డ్ రిజిస్టర్ లో నమోదు చేసి అధ్యాపకుడి కళాశాలకు పోస్ట్ ద్వారా పంపాలి. ఇక్కడ ఏం మాయ చేశారో కానీ గుట్టుచప్పుడు కాకుండా ప్రిన్సిపాల్స్ కూడా ఈ అనధికారిక జెన్యూనిటీ సర్టిఫికెట్లను ఆమోదించారనే ఆరోపణలు ఉన్నాయి.

**దేవరుప్పుల** జూనియర్ కళాశాలలో కూడా ఓ అధ్యాపకుడు తమిళనాడు రాష్ట్రనికి చెందిన ఒక యూనివర్సిటీ నుంచి పీజీ సర్టిఫికెట్లను సమర్పించి రెగ్యులర్ ఉద్యోగం పొందాడని అధికారులు గుర్తించారు. జెన్యూనిటీ సర్టిఫికెట్ ఇతడు కూడా డైరెక్టుగా చేతిగుండా కళాశాలలో అప్పటి ప్రిన్సిపాల్ కు సమర్పించిన్నట్లు తెలుస్తోంది.

**2005**

### అప్పటి వరకే చెల్లుబాటు..

**2005 వరకు మాత్రమే ఇతర రాష్ట్రలలో పీజీ చదివిన వారి సర్టిఫికెట్స్ మాత్రమే తెలంగాణ రాష్ట్రం లో చెల్లుబాటు అవుతాయని, 2005 తర్వాత ఇతర రాష్ట్రలలో దూర విద్య, స్టడీ సెంటర్స్ ద్వారా పీజీలు చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్లు మన రాష్ట్రం లో చెల్లుబాటు కావని సుప్రీం కోర్ట్ తీర్పు ఉంది. స్పెషల్ బ్రాంచ్ పోలీసులు చేపట్టబోయే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో ఇవి తప్పడు ధ్రువపత్రాలు అని తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేసి ఇప్పటి వరకు తీసుకున్న జీతాన్ని రికవరీ చేసే అవకాశం కూడా ఉందని ఇంటర్ విద్యా ఉన్నతాధికారులు అంటున్నారు. ఇప్పటికైనా తప్పడు సర్టిఫికెట్స్ కలిగి ఉన్న వ్యక్తులను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. అనర్హులను ఉద్యోగం నుంచి తొలగించి ప్రస్తుత ప్రజా ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా అర్హులతో ఈ ఉద్యోగాలను నింపాలని కోరుతున్నారు.**



## రైతుల కోసం అదనపు యూరియా కేంద్రాలు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** ప్రస్తుత వానాకాలం పంటల సాగు దశలో రైతులకు అవసరమైన యూరియా సకాలంలో, పారదర్శకంగా అందించుటకు జిల్లా వ్యాప్తంగా రైతు వేదికలతో పాటు పీఏసీఎస్‌లలో అదనపు విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఈ విక్రయ కేంద్రాలకు అవసరమైన ఈ-పాస్ యంత్రాలను సోమవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో పీఏసీఎస్ డీలర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా సరఫరా పెరుగుతున్న నేపథ్యంలో రైతు వేదికల వద్ద అదనపు యూరియా సేల్ కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. దీంతో రైతులు ఎలాంటి నిరీక్షణ లేకుండా తమ గ్రామంలోనే యూరియాను కొనుగోలు చేసుకోవచ్చన్నారు. యూరియా పంపిణీలో బాధ్యత వహించే సిబ్బందికి హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ కూడా అందించామన్నారు. రైతులు తమ తమ గ్రామాలకు కేటాయించిన రైతు వేదికలలో లేదా అదనపు విక్రయ కేంద్రాలలోనే యూరియా కొనుగోలు చేసుకోవాలన్నారు. యూరియా పంపిణీ వ్యవసాయ విస్తరణ అధికారుల పర్యవేక్షణలో పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని.. రైతులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డు, పంట నమోదు పత్రాలు తీసుకువచ్చి మాత్రమే యూరియా పొందాలన్నారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్ వంటి ఘటనలు చోటుచేసుకుంటే, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరానికి మించిన యూరియాను వాడవద్దని, శాస్త్రీయ పద్ధతిలో యూరియాను వినియోగించాలన్నారు.



## సీతారామచంద్రస్వామి దేవాలయంలో సంప్రోక్షణ

**జనగామ, మన చౌరాస్తా :** సంపూర్ణ చంద్రగ్రహణ శుద్ధిలో భాగంగా శ్రీ హనుమత్ రామనాథ సహిత శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో విశేష అభిషేక, స్నపన, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానార్చకులు మోహనకృష్ణ భార్గవ నేతృత్వంలో తెల్లవారుజామున పుణ్యాఃవచనంతో సంప్రోక్షణ జరిపారు. అనంతరం సుప్రభాత సేవతో శ్రీ సీతారామచంద్రస్వామి వారల మూలమూర్తులకు పంచామృత ఫలరస విశేష స్నపన నిర్వహించారు. అనంతరం అలంకరణ, ఆరాధన, అష్టోత్తర శతనామార్చనలు, మహానీరాజనం సేవా కైంకర్యాలు నిర్వహించారు. సోమవారం కూడా కలవడంతో శ్రీ రామనాథ స్వామి వారికి భక్తులు చేతుల మీదుగా రుద్రాభిషేకం జరిపారు. భగవన్నామ స్మరణ, వేదమంత్రాల నడుమ ఆధ్యాత్మిక వాతావరణంలో సంప్రోక్షణ పూజా క్రతువులు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమాల్లో దేవాలయ గౌరవాధ్యక్షుడు గజ్జెల నర్సిరెడ్డి, యెలసాని కృష్ణమూర్తి, కందాడి యాదగిరి, మల్లారెడ్డి, రాంబాబు, చంద్రమౌళి, సిద్ది రెడ్డి, పోచన్న పాల్గొన్నారు.

# మందులు శస్త్ర చికిత్స లేని వైద్యం ఫిజియోథెరపీ



**జనగామ, మన చౌరాస్తా :** ఫిజియోథెరపీ అంటే మందులు లేకుండా, శస్త్రచికిత్స లేకుండా, కేవలం శరీర వ్యాయామాలు, కదలికలు, ప్రత్యేక పరికరాల సహాయంతో చేసే చికిత్స అని జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. ప్రపంచ ఫిజియోథెరపి దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జిల్లా వైద్యాధికారి డా. మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన వేడుకలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలలో గాయపడిన వారు, పక్షవాతం వచ్చిన వారు, వెన్నునొప్పి, మెడనొప్పి, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నవారు, వృద్ధులు, క్రీడాకారులు అందరికీ ఇది అనుగ్రహం లాంటిది అన్నారు. రోగి ఆత్మవిశ్వాసాన్ని ఫిజియోథెరపీ డాక్టర్ పెంచుతారని అన్నారు. ఇవాళ్టి యుగంలో సెడెంటరీ లైఫ్‌స్టైల్ అంటే ఎక్కువగా కూర్చునే జీవనశైలి కారణంగా వెన్ను, మెడ, మోకాళ్ల సమస్యలు పెరుగుతున్నాయి. ఇవి మందులతో పూర్తిగా తగ్గవు. సరైన ఫిజియోథెరపీతోనే శాశ్వత ఉపశమనం పొందవచ్చాన్నారు. ఫిజియోథెరపీ డాక్టర్లు కేవలం శరీరానికి కాకుండా మనసుకూ ధైర్యం ఇస్తారని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పలువురు ఫిజియోథెరపీ డాక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్లు డి.దేవేందర్, డి.శివ శంకర్ రావు, పి.ప్రసాద్, బి.మొగిలి, ఎల్.అశోక్, సి.హెచ్ రాజశేఖర్, ఎన్.వసుమతి, ఎం .అనిత, బి.అఖిల్ కృష్ణ, బి.భార్గవి, బి.సుమశ్రీ, డాక్టర్ జైషీలా తదితరులు పాల్గొన్నారు.

మన చౌరాస్తా
The Complete News way
09.09.2025 మంగళవారం
Mana Chourasta


# ప్రజావాణి దరఖాస్తులపై తక్షణం స్పందించాలి

## అధికారులను ఆదేశించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా

**జనగామ, మన చౌరాస్తా :**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ సందర్భంగా అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, బెన్షాలోమ్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ దరఖాస్తులను స్వీకరించారు. లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన చర్ల పెల్లి స్వప్న తన భర్త రమేష్ తో 7 సంవత్సరాల క్రితం వివాహం జరిగిందని, ఇద్దరు పిల్లలు ఉన్నారని, వరకట్నం ఇచ్చిన అదనంగా డబ్బులు కావాలని వేధిస్తూ తన పిల్లలను తనను తీసుకువెళ్లడం లేదని తనకు న్యాయం చేయాలని దరఖాస్తు అందించారు. తరిగొప్పులకు చెందిన ఎర్రవెల్లి మరియ తనకు బోదకాలు పింఛన్ మంజూరు అయినదని ఇటీవల నిలిపివేసినందున చర్యలు తీసుకోవాలని దరఖాస్తు అందించారు. చిల్పూర్ మండలం ఫత్తేపూర్ గ్రామానికి చెందిన జాటోత్ వెంకట్ తాను నిరుపేద అయినందున తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిందని, ఇంటిపై నుంచి కరెంటు వైర్లు వెళ్లుతుండడం వలన నిర్మించుకోలేకపోతున్నానని వైర్లు తొలగింప జేస్తే ఇంటిని నిర్మించుకుంటానని దరఖాస్తు అందించారు. జనగామ మండలం సిద్ధంకి గ్రామానికి



చెందిన పెద్ద పాటి సామ్యూల్ తన దరఖాస్తు అందిస్తూ పి .లక్ష్మమ్మ వద్ద 24/A/4 సర్వే నెంబర్ ధరణి వచ్చిన దగ్గర నుంచి కనిపించడం లేదని దయచేసి ఆన్‌లైన్‌లో ఆ సర్వే నెంబర్‌ను ఎక్కించాలని దరఖాస్తు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందించిన దరఖాస్తులన్నిటిని సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. గ్రీవెన్స్‌లో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవోలు గోపిరామ్, వెంకన్న, డిప్యూటీ కలెక్టర్ సుహాసిని జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఒపెన్ ఎయిర్ థియేటర్ నిర్మించాలి



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రం లోని బతుకమ్మ కుంటలో ఒపెన్ ఎయిర్ థియేటర్ నిర్మించాలని విజ్ఞప్తి చేస్తూ కవులు కళాకారుల ఐక్య వేదిక తరపున కలక్టర్ కు ప్రజావాణిలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక తరపున జి.వై.గిరి పౌండేషన్ జి.కృష్ణ, అభినందన కల్చరల్ సోసైటీ అయిలా సోమనర్సింహచారి, శ్రీశ్రీ కళావేదిక లగిశెట్టి ప్రభాకర్ మాట్లాడుతూ గత సంవత్సరం జులైలో ప్రజావాణిలో బతుకమ్మ కుంటలో ఓపెన్ ఎయిర్ ధియేటర్ నిర్మాణం కోరుతూ 25 కళా సాహితి సంస్థలు సంతకాలతో కూడిన వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఈ మధ్యకాలంలో బతుకమ్మ కుంటను ప్రజానీకానికి అనుకూలంగా నూతనంగా నిర్మాణాలు చేపట్టుతున్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ బతుకమ్మ కుంట సుందరీకరణలో ఓపెన్ ఎయిర్ ధియేటర్ నిర్మాణం చేపట్టి కళా, సాహితి సంస్థల అధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహణకు ప్రోత్సాహం అందించాలని కోరారు. కలక్టర్ స్పందిస్తూ స్టేజీ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు.

## ఈరన్న క్వారీ పర్మిషన్ రద్దు చేయాలి



**జనగామ, మన చౌరాస్తా :** రఘునాథపల్లి మండలం కోమల్ల గ్రామంలోని సర్వేనెంబర్ 48 లో ఉన్న ఈరన్న గుట్ట క్వారీ పర్మిషన్ రద్దు చేయలని జేఎంఐ నేషనల్ కో కన్వీనర్లు కన్నారపు పరుశురాములు, కొమ్ముల సరేవందర్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కోమల్లలో చిన్న సన్న కారు (దళిత ) రైతు కూలీలైన తాము తమకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో వ్యవసాయ పంటలు వేసుకుంటూ జీవిస్తున్నామని తెలిపారు. ఈరన్న గుట్టచ వద్ద క్వారీ నిర్వహించడం వల్ల గుట్టకు అనుకొని ఉన్న తమ భూములకు ఇబ్బందిగా ఏర్పడే అవకాశాలు ఉన్నందని, అలాగే పాడి పంటలు మా యొక్క ఎడ్లు ఆవులు, గొర్రెలు, మేకలు పశు గ్రాసం కోసం ఇంకా గ్రామంలోని అనేక వసతుల విషయంలో మూడు గ్రామాల ప్రజలు ఈ గుట్టపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. అలాంటి సహజవనరుల సంపద కలిగిన గుట్టలను క్వారీలకు ఇవ్వొద్దని కోరారు.



## కొత్తకొండ ఆలయ సంప్రోక్షణ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవాలయంలో చంద్రగ్రహణం కారణంగా మూసివేసిన ఆలయాన్ని తిరిగి తెరిచి, సంప్రోక్షణ కార్యక్రమమం నిర్వహించారు. సోమవారం ఉదయం 7:30 గంటలకు ఆలయ తలుపులు తెరిచి, ఆలయ శుద్ధి, పుణ్యావాచనంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం మొత్తాన్ని సంప్రోక్షణ చేసి, భక్తులకు యథావిధిగా దర్శనం, పూజా కార్యక్రమాలు కొనసాగించారు. దేవాలయ కార్యనిర్వహణాధికారి పి. కిషన్ రావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.


## కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** రైతులకు యూరియా సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా దిష్టిబొమ్మ దహనం చేసి, తెలంగాణ రైతాంగానికి అవసరమైన యూరియా అందించడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతల ఆరోపణల ప్రకారం, రాష్ట్రానికి చెందిన 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ, యూరియా సరఫరా సమస్యపై వారు స్పందించడం లేదని, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. యూరియా కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే 17 సార్లు కేంద్రాన్ని సంప్రదించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు. అంతకుముందు గ్రామాల్లో ప్రభావాన్ని కోల్పోతున్న బీఆర్ఎస్ నాయకులు, రాజకీయ లాభాల కోసం రైతులను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పై వచ్చిన విమర్శలను వారు ఖండిస్తూ, ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న నాయకుడిగా ఆయనను పేర్కొన్నారు. వారానికి మూడు రోజులు హుస్నాబాద్‌లో క్యాంప్ కార్యాలయంలో ఉండి, ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు శ్రమిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.





# అంపశయ్య నవీన్, రమాదేవీలకు
# పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారం



**ఈ నెల 13న రవీంద్రభారతిలో ప్రదానం**

**హుస్నాబాద్, మన చౌరాస్తా:** మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతి సంవత్సరం రచయితలకు, కళాకారులకు అందించే పొన్నం సత్తయ్య జీవితసాఫల్య పురస్కారాలు ఈ ఏడాది సాహిత్య రంగంలో ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్, కళారంగంలో ప్రజాగాయని అంతడుపుల రమాదేవిలకు లభించనున్నాయి. ఎంపిక కమిటీ కన్వీనర్ డా. పొన్నం రవిచంద్ర సారథ్యంలో, జ్యూరీలో మాడభూషి శ్రీధర్, దిలీప్ రెడ్డి, మామిడి హరికృష్ణ, అయినంపూడి శ్రీలక్ష్మి సభ్యులుగా ఉండి, పలువురు రచయితలు, కళాకారుల పేర్లను పరిశీలించిన అనంతరం ఈ ఇద్దరిని ఎంపిక చేశారు. ఎంపిక పత్రాన్ని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి అందజేశారు. గత మూడు సంవత్సరాల్లో సాహిత్య విభాగంలో నాళేశ్వరం శంకరం, నలిమెలా భాస్కర్, చంద్రబోస్ లకు, కళారంగంలో ఒగ్గు ధర్మయ్య, కామ్రేడ్ విమలక్క, బలగం ఫేమ్ కొమురమ్మ లకు అవార్డులు అందించబడ్డాయి.



# ఇందిరమ్మ ఇండ్లకు ఆటంకాలు తొలగించాలి

## ■ సీపీఎం జిల్లా నేత శశిధర్




**కొమరవెల్లి, మన చౌరాస్తా :** ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకునే వారికి ఇసుక, మొరం, మట్టి అన్ని ప్రభుత్వం సమకూర్చుతుందని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవచ్చని ప్రభుత్వం ప్రకటన చేస్తున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో ఇసుక, మట్టి, మొరం దొరకక అందుబాటులో ఉన్న వాగులు కుంటలు మట్టి ఉన్న ప్రాంతాల నుండి లబ్ధిదారులు తెచ్చుకోకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్ అన్నారు. సోమవారం రోజున కొమురవెల్లి మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో శశిధర్ మాట్లాడుతూ ఎంతో ఆర్భాటంగా ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేసినవారికి ప్రభుత్వమే అన్ని సౌకర్యాలు కల్పించి ఇళ్ల నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చేస్తామన్నారనీ కానీ గ్రామీణ ప్రాంతాలలో అందుబాటులో ఉన్న వాగులు, కుంటలు, మొరం గడ్డలు ఉన్న ప్రాంతాల నుండి ఇసుక, మొరం, మట్టి ఇండ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ట్రాక్టర్ల ద్వారా తెచ్చుకునే క్రమంలో గ్రామంలో గ్రామ వ్యతిరేకులు కొంతమంది అధికారులకు కంప్లైంటు చేయడం వల్ల రెవెన్యూ ఇరిగేషన్ పోలీస్ మైనింగ్ ఇతర శాఖల అధికారులు పైనుండి మాకు ఎలాంటి ఆదేశాలు లేవని ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న ప్రతి లబ్ధిదారునికి ఎలాంటి ఆటంకం, అభ్యంతరాలు లేకుండా ఇసుక మట్టి మొరం అందేవిధంగా ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. పేరుకే పథకాలు ప్రకటించడం కాదని వాటి విధివిధానాలు రూపొందించినప్పుడు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పథకాలు అమలయ్యే విధంగా ఆదేశాలు జారీ చేయాలన్నారు. లేనిపక్షంలో ఇబ్బందులకు గురవుతున్న ప్రజలందరి సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కొమురవెల్లి మండల కార్యదర్శి తాడూరి రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు అత్తిని శారద, మండల నాయకులు తేలు ఇస్తారీ, తాడూరి మల్లేష్, పుల్లంపల్లి సాయిలు, బక్కిలి బాలకిషన్, నాయకులు కానాగుల రాజు, సున్నం యాదగిరి, తాడూరి నరేష్, బాలస్వామి, కర్రోళ్ల ఎల్లయ్య, మల్కని కనకయ్య, ప్రశాంత్, సార్ల యాదయ్య, ఆరుట్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



# 10న ఫైనల్ ఓటర్ లిస్ట్

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల తుది ఓటరు జాబితాను ఈ నెల 10న వెలువరించడం జరుగుతుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లోఅదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, జడ్పీ సీఈఓ మాధురి షాతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే అన్ని మండలాల్లో గ్రామ పంచాయతీల వారీగా ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రచురించడం జరిగిందని అన్నారు. ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు జరిపిన తర్వాత ఈ నెల 10వ తుది జాబితా వెలువరిస్తామని తెలిపారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ సీఈఓ సరిత, కాంగ్రెస్ పార్టీ నుంచి భృంగి భాస్కర్, బీజేపీ నుంచి ఏగుర్ల విజయ భాస్కర్, బీఆర్ఎస్ నుంచి రావేల రవి, బీఎస్పీ నుంచి మడిపడిగ చంద్రశేఖర్,, టీడీపీ నుంచి తేజవత్ అజయ్ కుమార్, సీపీఐ నుంచి సోమయ్య, సీపీఎం నుంచి జోగు ప్రకాష్ పాల్గొన్నారు.

## గీతా కార్మిక సంఘం
# మండల కమిటీ ఎన్నిక



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం భీమదేవరపల్లి నూతన మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు వల్లాల గంగాధర్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు సారా వెంకటేష్ గౌడ్, మంద రమేష్ గౌడ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల గీతా కార్మికులు సొసైటీ అధ్యక్షులు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా బుర్ర సమ్మయ్య గౌడ్, మండల ప్రధాన కార్యదర్శిగా మాచర్ల కుమారస్వామిగౌడ్, గౌరవ అధ్యక్షులుగా కృష్ణమూర్తి , గౌరవ సలహాదారులుగా తాళ్లపల్లి సదానందం , గుర్రపు రమేష్ , జానా సారయ్య , జానా రమేష్ ఉపాధ్యక్షులుగా వంగ శ్రీనివాస్ , వల్లాల రాజమౌళి , కాసగోని రవి , బుర్ర సమ్మయ్య , సహాయ కార్యదర్శిగా గోపగాని సమన్ , కాసగోని రవీందర్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు తాళ్లపల్లి మల్లయ్య గౌడ్ వివిధ గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు, గీతా కార్మికులు పాల్గొన్నారు.

# పత్తి రైతుల సమస్యలు పరిష్కరించాలి

చేర్యాల, మన చౌరాస్తా : బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం విదేశీ పత్తి దిగుమతులపై సుంకాలను తొలగించి మన దేశ పత్తి రైతుల పై ఆంక్షలు విధిస్తూ కనీస మద్దతు ధరను ప్రకటించకుండా పత్తి రైతులను మోసగించే చర్యలు మానుకోవాలని పత్తి రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని (ఏఐకేఎస్) తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రోజున చేర్యాల తహసిల్దార్ దిలీప్ నాయక్‌కు పత్తి రైతుల పలు డిమాండ్లతో కూడిన మెమోరాండాన్ని సమర్పించడం అందజేశారు. ఈ సందర్భంగా కొంగరి వెంకట మావో మాట్లాడుతూ భారతదేశంలోని పత్తి సాగు చేసే 60 లక్షల రైతు కుటుంబాలను నట్టేట ముంచేందుకు మోడీ చూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గొర్రె శ్రీనివాస్ రైతు సంఘం నాయకులు మోకు ఇంద్రం, ఎన్. కనకయ్య, తుప్పతిరాజు తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధులు, రోగులకు
# పండ్లు, బ్రెడ్ పంపిణీ

**బచ్చనపేట, మన చౌరస్తా :** బచ్చనపేట మండలంలోని సాల్వాపూర్ గ్రామంలో తమ పూర్వ ఆంగ్ల ఉపాధ్యాయుడు అందే విజయ్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులు రోగులకు, వృద్ధులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. తమకు విద్యను నేర్పించిన గురువు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని వారు తెలిపారు. కార్యక్రమం లో నవీన్ కుమార్, అఖిల, సుదర్శన్, రాజు, మల్లేష్, తిరుపతి, లక్ష్మణ్, మల్లికార్జున్, అనిల్, జనార్ధన్ పాల్గొన్నారు.








# ముసాయిదా ఓటర్ లిస్ట్‌పై మీటింగ్



**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలో ముసాయిదా ఓటర్లు, పోలింగ్ కేంద్రాల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలోని 12మండలాల్లో గ్రామపంచాయతీల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను ఇప్పటికే ప్రచురించడం జరిగిందని అన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా పై ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలియజేయాలన్నారు. సోమవారం 12మండలాల్లో ఎంపీడీవోలు మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు మండలాల్లో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే వాటి సమాచారాన్ని అందజేయాలన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధుల నుండి ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి 9వ తేదీన సవరించిన అనంతరం పదో తేదీన ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా తుది ఓటర్ల జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయని, 12 మండల ప్రజా పరిషత్, 12 జిల్లా ప్రజా పరిషత్ లు ఉన్నాయి అని పేర్కొన్నారు. జిల్లాలో 370871 మంది ఓటర్లు ఉండగా , ఇందులో మహిళా ఓటర్లు 190201 ఉండగా, పురుష ఓటర్లు 180666, ఇతరులు నలుగురు ఓటర్లు ఉన్నారని తెలియజేశారు. హనుమకొండ జిల్లాలో 631 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా పరిషత్ ఇన్చార్జి సీఈవో రవి సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇ.వి. శ్రీనివాసరావు, శ్యాంసుందర్, ప్రభాకర్ రెడ్డి, సయ్యద్ ఫైజుల్లా, నిశాంత్, రజనీకాంత్, ఎండి. నేహాల్, డాక్టర్ ఇండ్ల నాగేశ్వరరావు, ప్రవీణ్ కుమార్, జయంత్ లాల్, తదితరులతోపాటు అధికారులు పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటర్ లీస్టులో అభ్యంతరాలు ఉంటే చెప్పండి

**లింగాలఘనపురం, మన చౌరాస్తా** : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారు ఓటరు లిస్ట్‌ను రెడీ చేస్తున్నారు. ఈ మేరకు ముసాయిదా లిస్ట్‌ను సోమవారం ప్రజా పరిషత్ కార్యాలయ నోటీసు బోర్డుపై ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో స్థానిక అసిస్టెంట్ ఎన్నికల అధికారి, మండల అభివృద్ధి అధికారి ఎన్. రఘురామకృష్ణ మాట్లాడుతూ ముసాయిదా లిస్ట్‌లో ఎమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ సీతారాం నాయుడు, సీనియర్ అసిస్టెంట్ నాగరాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.





## వినతులను సత్వరం పరిష్కరించాలి

**వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

వరంగల్, వరంగల్ : ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని వరంగల్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల ఫిర్యాదులను కలెక్టర్ స్వయంగా స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా శాఖల అధికారులకు అందజేశారు. నేటి ప్రజావాణి కార్యక్రమానికి 136 ఫిర్యాదులు రాగా, అధికంగా రెవెన్యూ సమస్యలు 60, జిడబ్ల్యూఎంసీ 21, విద్యాశాఖ 11, సహకార శాఖ 9, గృహ నిర్మాణ శాఖ 7, వైద్య ఆరోగ్య శాఖ, ఉపాధి కల్పన శాఖలకు 3 చొప్పున, ఇతర శాఖలకు సంబంధించిన 22 ఫిర్యాదులు వచ్చాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు సంధ్యారాణి, డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిపిఓ అనురాధ, డిఎం హెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, హౌసింగ్ పీడీ గణపతి, డిసిఓ రాజమణి, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, ఆర్సివో అపర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు, విభాగాల పర్యవేక్షకులు,తదితరులు పాల్గొన్నారు.

## పసరమడ్ల టీచర్‌కు అరుదైన ఘనత



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మండలం పసరమడ్ల ప్రాథమికోన్నత పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు బండ కృష్ణ అరుదైన ఘనత సాధించారు. సీసీ ఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్సెస్ అండ్ ట్రైనింగ్) మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఢిల్లీ వారు నిర్వహిస్తున్న (నేషనల్ ఎడ్యూకేషన్ పాలసీఎన్ ఈ పి 2020) ఓరియంటేషన్‌కు తెలంగాణ వ్యాప్తంగా పది మంది ఉపాధ్యాయులను ఎంపిక చేయగా జిల్లా నుంచి కృష్ణ ఎంపిక య్యారు. ఈ నెల 8 నుంచి 27 వరకు 21 రోజుల పాటు హైదరాబాద్‌లో సీసీఆర్ టీలో శిక్షణ ఇవ్వనున్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- **వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**హనుమకొండ, మన చౌరాస్తా :** ఈ నెల 13వ తేదీన జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... రాజీ పడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ తదితర కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుందని తెలిపారు. రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా లోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు, ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడ్డదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుంది అని పోలీస్ కమిషనర్ తెలిపారు.

